క్లుప్తంగా

రెవెన్యూ గ్రామ సభలకు 45 అర్జీలు

సంతనూతలపాడు: మండలంలోని రుద్రవరం, లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రీ సర్వే రెవెన్యూ గ్రామ సభలకు రైతుల నుంచి 45 అర్జీలు దాఖలయ్యాయి. జాయింట్ ఎల్పీఎంకు సంబంధించి అధికంగా రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. 45 రోజుల్లో రైతులకు సంబంధించిన అర్జీలను పరిష్కరించనున్నట్టు సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. రుద్రవరం, లక్ష్మీపురం గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.మాబు సుభానీ, ఆర్ఐ రామ్‌తేజ, వీఆర్వో ఎం.శ్రీనివాసులు, గ్రామ సర్వేయర్ మాధవరావు, లక్ష్మీపురం సర్పంచ్ ఎం.రామానాయుడు, గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు. సోమవారంతో సంతనూతలపాడు మండలంలో రీ సర్వే రెవెన్యూ గ్రామసభలు ముగిసాయి.

ఏజెంట్లకు నష్టం కలిగించే చర్యలను విడనాడాలి



ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

ఒంగోలు వన్‌టౌన్: ఎల్ఐసీ ఏజెంట్లకు నష్టం కలిగించే చర్యలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా నాయకుడు కె.బాలచంద్రం కోరారు. కేంద్ర ప్రభుత్వం, ఐఆర్డీఏఐ ప్రతిపాదించిన నూతన విధానాలకు వ్యతిరేకంగా ఒంగోలు ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం చర్యలకు నిరసనగా ఈ నెల 11న నెల్లూరు ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. నూతన నిబంధనల వలన ఏజెంట్లు పొందిన కమీషన్ తిరిగి వెనక్కి ఇవ్వాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ల యూనియన్ నాయకులు బి.వెంకట్రావు, కె.రమణారెడ్డి, డి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రగల్భాల మోదీకి గుణపాఠం చెబుదాం


సమావేశంలో ప్రసంగిస్తున్న చుండూరి రంగారావు

ఒంగోలు టౌన్: ఆర్థికాభివృద్ధిలో మన దేశం చైనా కంటే ముందుందని ప్రగల్భాలు పలుకుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గుణపాఠం చెప్పాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అన్నారు. ఒంగోలు సీపీఐ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ దేశ ప్రజల సంపదను గంపగుత్తగా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ.. దేశ ఆర్థిక పరిస్థితి బాగుందని సొంత మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇటువంటి అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని చెప్పారు. ఆరుగాలం శ్రమించి అన్నం మెతుకులు పండించే రైతన్నలకు దేశ ప్రజలంతా అండగా నిలబడాలని కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధ విధానాల మీద ఈ నెల 26వ తేదీ కవులు, రచయితలు, కళాకారులు, ప్రజా సంఘాలతో కలిసి సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బై బై బీమా..!


వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు


మినుము...

- ఉచిత పంటల బీమాకు మంగళం పాడిన కూటమి సర్కార్
- సాగుచేసిన పంటలకు రైతులే బీమా నగదు చెల్లించాలంటూ ఉత్తర్వులు
- గత ప్రభుత్వంలో రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే లబ్ధి
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బీమాపై ధీమా లేదంటూ అన్నదాతల ఆవేదన

ఒంగోలు సిటీ: రైతులంటే సీఎం చంద్రబాబు నాయుడికి చిన్నచూపేనని మరొకసారి రుజువైంది. గతంలో వ్యవసాయం దండగని వ్యాఖ్యానించి రైతుల వ్యతిరేకతను చవిచూసిన చంద్రబాబు.. నేటికీ తన నైజాన్ని చాటుకుంటూనే ఉన్నారు. ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడి సాయం అందించాల్సిన సీఎం మొండిచేయి చూపి వ్యవసాయం దండగని, అలాంటి దానికి సాయం ఎందుకని చెప్పకనే చెబుతున్నారు. పెట్టుబడి సాయం అందక, వర్షాభావ పరిస్థితుల కారణంగా కొట్టుమిట్టాడుతున్న రైతులపై మరోభారం మోపారు. ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేశారు. దీంతో రైతులు, రైతు సంఘాల నేతలు కూటమి సర్కారుపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ పంటలకు బీమా ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తిస్తుందని తేల్చేశారు. ఆ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులపై పైసా భారం పడకుండా ఐదేళ్ల పాటు విజయవంతంగా ఉచిత పంటల బీమాను అమలు చేసింది. దీంతో తీవ్రమైన వర్షాలు, వరదల వల్ల పంటలకు నష్టం వాటిల్లిన సమయంలో పరిహారం రూపంలో రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం ఎంతగానో ఉపయోగపడేది. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేసి రైతులే తమ పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించుకోవాలని ప్రకటించింది. ఇప్పటికీ చాలా మంది రైతులకు బీమాకు సంబంధించిన ప్రీమియం ఎంత కట్టాలో తెలియని పరిస్థితి. అసలే ఖరీఫ్ సీజన్‌లో నష్టాలు మూటగట్టుకున్న రైతులు ప్రీమియం ఎలా చెల్లించాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.


సాగులో ఉన్న వరి పంట

కష్టాల్లో అన్నదాతకు అండగా జగనన్న...

రైతుపై బీమా ప్రీమియం భారం పడకుండా ఉండేందుకు జగనన్న తన ప్రభుత్వ హయాంలో 2019 ఖరీఫ్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చారు. పంట నమోదు ఆధారంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. దీని వలన పంటల బీమా పథకం గురించి రైతులకు ఇబ్బందులు తప్పేవి. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా పథకం వర్తించడంతో పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపుకార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 1,25,567 మంది రైతులకు రూ.72,075.23 లక్షల వరకు పంట నష్టపరిహారం చెల్లించింది.

పంటలకు చెల్లించాల్సిన బీమా ప్రీమియం వివరాలు...

పంట	ఎకరాకు చెల్లించాల్సిన నగదు
శనగలు	రూ.368
మినుము	రూ.103
మొక్కజొన్న	రూ.105
వరి	రూ.215
ఎండుమిరప	రూ.525
జొన్న	రూ.60

ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి :



పంటల బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు చెల్లించాల్సిన ప్రీమియంను కూడా జగనన్నే చెల్లించి ఆదుకున్నారు. దీంతో పంటలు నష్టపోయినప్పుడు రైతులకు పరిహారం వెంటనే అందేది.

– పి.వెంకటేశ్వరరెడ్డి, రైతు, కొత్తపట్నం

గడువులోగా రైతులే ప్రీమియం చెల్లించాలి :



రబీలో గుర్తించిన పంటలకు ప్రభుత్వం నిర్దేశించిన బీమా ప్రీమియంను గడువులోగా రైతులే చెల్లించాలి. రైతులు సాగుచేసిన శనగ, వేరుశనగ, జొన్న, పంటలకు డిసెంబరు 15లోపు ప్రీమియం చెల్లించాలి. వరి పంటకు సంబంధించిన ప్రీమియంను డిసెంబరు 31వ తేదీ వరకు చెల్లించవచ్చు. ఎవరైతే రైతులు పంటల బీమాకు ప్రీమియం చెల్లిస్తారో వారికే నష్టపరిహారం వర్తిస్తుంది.

– కిషోర్‌కుమార్, ఏఓ, ఒంగోలు

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి భూమి పూజ

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి సోమవారం భూమి పూజ చేశారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి అధ్యక్షతన తొలుత పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీదేవి టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద కేంద్ర ప్రభుత్వం పాఠశాలల క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయడానికి శ్రీకారం చుట్టిందన్నారు. కొత్తపట్నం హైస్కూల్‌కు ఇప్పటికి రెండు విడతలుగా రెండు లక్షల రూపాయలు మంజూరు చేశారన్నారు. సంవత్సరానికి ఒక్కో లక్ష చొప్పున రూ.5 లక్షలను ఐదు సంవత్సరాలలో ఈ పథకం ద్వారా మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ నగదుతో క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలన్నారు. భూమి పూజలో పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డి.సాయి కిషోర్, ఫయాజ్, భాను ప్రతాప్, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న హెచ్ఎం శ్రీదేవి, చైర్మన్ వంశీకృష్ణారెడ్డి

చలో ఒంగోలుకు తరలిరండి

చీమకుర్తి: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఈ నెల 11న ఒంగోలు వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన చలో ఒంగోలు కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం చీమకుర్తిలోని క్రిస్టియన్‌పాలెంలో చలో ఒంగోలుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మంద కృష్ణమాదిగ వస్తున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు బొంతా ఏసుదాస్ పిలుపునిచ్చారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, జడ విజయకుమార్, కర్నా ప్రసాద్, బుట్టి సాల్మన్, స్థానికులు పాల్గొన్నారు.

మేస్త్రీలను కొనసాగించాలి

ఒంగోలు సిటీ: పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలను విధుల్లో కొనసాగించాలని ఆ యూనియన్ ఒంగోలు నగర కార్యదర్శి టి.విజయ డిమాండ్ చేశారు. సోమవారం ఒంగోలు మున్సిపల్ ఆఫీస్ ఎదురు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ ఒంగోలు కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంలో మేస్త్రీలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికుల్ని కొనసాగించాలని, మేస్త్రీ కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు 106 మంది మేస్త్రీ కార్మికులను విధులకు హాజరుకాకుండా ఆపేయడం మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మేస్త్రీల వ్యవస్థ కొనసాగుతోందన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థలో ప్రభుత్వం ఎలాంటి సర్క్యులర్‌గానీ, జీవోగానీ ఇవ్వకుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కార్మికులపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వాస్తవాన్ని పరిశీలించి అక్టోబర్ నెల వేతనాలు ఇవ్వాలని, మేస్త్రీలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యు.రత్నకుమారి, కార్మికులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

19న నాయీబ్రాహ్మణ కార్తీక వన సమారాధన

ఒంగోలు సిటీ: ఒంగోలు పట్టణ క్షౌ రశాలల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19న యరజర్ల–కందులూరు మధ్య ఉన్న వీఆర్ఎస్‌కే గ్రీన్‌సిటీలో నాయీబ్రాహ్మణ కార్తీకమాస వన సమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు కొణిజేటి రామకృష్ణ సోమవారం తెలిపారు. అనంతరం కొండమీద శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆ రోజు 366 శివలింగాలతో మహాలింగార్చన అభిషేకం, పూజా కార్యక్రమాలను భక్తులందరిచే సామూహికంగా జరిపించనున్నట్లు తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలోని నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు ఏల్చూరి వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసరావు, ఎం.అజయ్‌కుమార్, ఎం.రామారావు, జి.రాంబాబు, నాదెండ్ల రాఘవ, ఎస్.కోటేశ్వరరావు, వి.వెంకటరామయ్య, కరువది వేణు, వి.సుధాకరరావు, ఎం.శ్రీనివాసులు, పి.సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘు నాయకులు

స్వయం సమృద్ధి కోసం ఎనీ టైం మనీ పద్ధతి

ఒంగోలు సిటీ: ప్రకృతి వ్యవసాయంలో స్వయం సమృద్ధి కోసం ఎనీ టైం మనీ పద్ధతిని ప్రోత్సహిస్తున్నట్లు యూనిట్ ఇన్‌చార్జ్ సింగమనేని రాధా తెలిపారు. సోమవారం ఒంగోలు మండలంలోని ఉలిచి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజరు సుభాషిణి ఆధ్వర్యంలో బీజామృతంతో విత్తనశుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ రైతులు నిరంతర ఆదాయం పొందేందుకు ఎనీ టైమ్ మనీ (ఏటీఎం) పద్ధతిలో భాగంగా 20 సెంట్ల పొలంలో ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, దుంప జాతి విత్తనాలు నాటామని తెలిపారు. ఈ విధానం ద్వారా పచ్చని కూరగాయలు నిరంతరంగా అందుబాటులో ఉండటమే కాకుండా రైతులకు స్వయం సమృద్ధిని అందించే మార్గం కలుగుతుందన్నారు. ఈ మోడల్ ద్వారా ఇతర రైతులు కూడా ప్రేరణగా తీసుకుని వారి పొలాల్లో ఉపయోగించుకోవచ్చన్నారు. తద్వారా కుటుంబాల ఆహారభద్రతను మెరుగుపరచడం, పర్యావరణానికి అనుకూల వ్యవసాయం చేయడం సుసాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీఎస్‌లు ఐశ్వర్య, కృష్ణవేణి, మరియమ్మ, మన్మథ, నాని, గ్రామ రైతులు చుంచు సింగయ్య, చలమయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఉలిచిలో విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేస్తున్న రాధా, రైతులు

మాలధారులకు అన్నదానం ప్రారంభం

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం దాతల ఆధ్వర్యంలో మాలధారులకు బిక్ష ప్రారంభమైంది. డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 21 సంవత్సరాల నుంచి అన్నదానం చేస్తున్నారు. సంతనూతలపాడు గ్రామస్తులు తన్నీరు మోహనరావు, ఎం.రామారావు, కే.నాగాంజనేయులు, ఉప సర్పంచ్ ఇన్నమూరి వెంకటసుబ్బయ్య ఇతర దాతలు సహకారంతో మాలధారులకు అన్నదానాన్ని ప్రారంభించారు. 41 రోజుల పాటు కొనసాగే అన్నదాన కార్యక్రమానికి సోమవారం సుమారు 150 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, రుద్రవరం సర్పంచ్ బల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాలధారులు

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

మద్దిపాడు: మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులకు నైపుణ్య గణన శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సచివాలయ ఉద్యోగులు సందర్శించి ఆ ఇంట్లో ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి వివరాలను నైపుణ్య దర్శిని యాప్‌లో నమోదు చేయించాలని ఎంపీడీఓ వీ జ్యోతి సూచించారు. వారి ప్రతి నైపుణ్యాన్ని యాప్‌లో నమోదు చేయిస్తూ పూర్తి వివరాలు, సర్టిఫికెట్లు కూడా యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ విధంగా చేయడం వలన నైపుణ్యం ఉండి ఉద్యోగాలు లేని వారికి అవకాశం కల్పించవచ్చని తెలిపారు. అనంతరం పెన్షన్ల పంపిణీలో అలసత్వంగా వ్యవహరించిన పలువురు ఉద్యోగులను ఎంపీడీఓ ప్రశ్నించారు. మరోమారు అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి విషయం తాను గమనిస్తున్నానని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రఘుబాబు, కో ఆర్డినేటర్లు నబీ, సుభాషిణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఒంగోలు రాంనగర్‌లో చోరీ

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డున ఉన్న ఒక ప్రొవిజనల్ దుకాణంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు నగరంలోని రాంనగర్ 4వ లైనులో గల వీరాంజనేయులు ప్రొవిజనల్ దుకాణంలో దొంగలు పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుకాణం షట్టర్ పగులగొట్టిన దొంగలు లోపలికి ప్రవేశించారు. గల్లా పెట్టిలో ఉన్న 2 వేల రూపాయల నగదు దొంగిలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓం నమః శివాయ



తొలి కార్తీక సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఒంగోలు నగరంలోని శివాలయాలకు భారీగా చేరుకున్న మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పరమశివుడిని దర్శించుకుని పులకించిపోయారు. ఓం నమః శివాయ నామస్మరణ మార్మోగింది.








కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో...




ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ వద్ద గల శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు